## గుర్ల డయేరియాపై చర్యలు శూన్యం

**మండలిలో బొత్స ఆరోపణలను తిప్పికొట్టిన అచ్చన్న**

అమరావతి,నవంబర్13 : విజయనగరం జిల్లా గుర్లలో డయేరియా కేసులపై శాసన మండలిలో స్వల్ప వాగ్వాదం జరిగింది. బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందంటూ మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ చేసిన విమర్శలను మంత్రి అచ్చెన్నాయుడు తిప్పికొట్టారు. ప్రభుత్వం తరపున ఇంకా పర్యవేక్షణ లోపం ఉందని బొత్స ఆరోపించారు. మృతుల విషయంలో స్పష్టత లేదన్నారు. అనంతరం అచ్చెన్నాయుడు స్పందిస్తూ గత ఐదేళ్లలో వాటర్ ట్యాంక్‌లలో పిడికెడు బ్లీచింగ్ కూడా వేసిన సందర్భాలు లేవన్నారు. పంచాయతీలకు పైసా నిధులు కేటాయించకపోగా.. కేంద్రం ఇచ్చిన వాటినీ దారిమళ్లించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.4వేలకోట్లతో పంచాయతీలను బలోపేతం చేసే చర్యలు చేపట్టిందన్నారు.


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి

రి.నెం. 119/2015

ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా

ఉచిత కళ్యాణ మండపం | స్వయం ఉపాధి శిక్షణ | ఉచిత రక్తదానము | ఉచిత న్యాయ సలహాలు | ఉచిత కంప్యూటర్ శిక్షణ

సంప్రదించవలసిన చిరునామా

అధ్యక్షులు ఆవుల విజయభాస్కర రెడ్డి అడ్వకేట్ B.A.LL.B

ఆళ్లగడ్డ

9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 14-11-2024 సంపుటి : 06 సంచిక : 47 పేజీలు : 8 వెల : రూ 3-00


# ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా రఘురామకృష్ణరాజు

## అధికారికంగా ప్రకటించిన చంద్రబాబునాయుడు

తిరుమల, నవంబర్ 13 : ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు ఖరారయ్యారు. ఈ నిర్ణయాన్ని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించారు. డిప్యూటీ స్పీకర్ పదవికి ఇవాళ నోటిఫికేషన్ విడుదల కానుంది. దీంతో బుధవారం ఆయన నామినేషన్ వేయనున్నట్లు తెలుస్తోంది. డిప్యూటీ స్పీకర్‌గా రఘురామ రాజు ఎంపిక లాంఛన ప్రాయం గానే జరగనుంది. ప్రస్తుతం అసెంబ్లీలో ఎన్డీయే కూట మికి స్పష్టమైన మెజారిటీ ఉంది. వైసీపీకి కేవలం 11 మంది ఎమ్మె ల్యే ఉండటం.. పైగా వారు శాసన సభకు దూరంగా ఉండటంతో ఏకగ్రీవంగానే రఘురామ ఎన్నిక కానున్నారు. బీజేపీలో రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టిన రఘురామ



కృష్ణరాజు 2019 ఎన్నికల ముందు వైసీపీలో చేరారు. నరసాపురం నుంచి ఎంపీగా పోటీ చేసి గెలిచారు. కానీ కొంతకాలానికే జగన్‌పై ఆయన విమర్శలు చేస్తూ రెబల్‌గా మారారు. ఈ క్రమంలో గత ఎన్నికల ముందు రఘురామ టీడీపీలో చేరారు. ఉండి నుంచి ఎమ్మెల్యేగా పోటీ గెలిచారు.

# ఇక ప్రాంతీయ భాషల్లోనూ వైద్యవిద్య

**దేశీయంగా మరో 75వేల మెడికల్ సీట్ల పెంపు**

**పేదలకు ఆరోగ్యం చేరువ చేయాలన్న లక్ష్యం**

**దర్భంగా ఎయిమ్స్ శంకుస్థాపనలో ప్రధాని మోడీ**



పాట్నా,నవంబర్13 : త్వరలోనే హిందీ సహా పలు భారతీయ భాషల్లో వైద్య విద్య అందుబాటు లోకి వస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఇందుకోసం ప్రయత్నాలు ప్రారంభించామని అన్నారు. దేశీయ భాషల్లో వైద్యవిద్య వల్ల సామాన్యులుకు అందుబాటులోకి రావడమే గాకుండా, వైద్య సేవల్లో నాణ్యత పెరుగుతుందని అన్నారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా లక్ష మెడికల్ సీట్లను జోడించామని.. రాబోయే ఐదేళ్లలో మరో 75 వేల మెడికల్ సీట్లు అందుబాటులోకి తీసుకొస్తామని వైద్య విద్యార్థులకు ప్రధాని హామీ ఇచ్చారు. దేశంలో 1.5 లక్షలకు పైగా ఉన్న 'ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు' బడుగు బలహీనవర్గాలకు మెరుగైన సేవలందిస్తున్నాయని తెలిపారు. దేశంలో దాదాపు నాలుగు కోట్ల మంది ప్రజలు దీని ద్వారా ప్రయోజనం పొందుతున్నారన్నారు. దర్భంగా చేరుకున్న ప్రధాని నరేంద్ర మోదీ అక్కడ పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ప్రధాని మోదీ ఎయిమ్స్ దర్భంగాను ప్రారంభించారు. 1260 కోట్ల రూపాయలతో భాగల్‌పూర్ ఎయిమ్స్‌కు శంకుస్థాపన చేశారు. ఆరోగ్య రంగంలో ప్రధానంగా ఐదు అంశాలపై మా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. నిరుపేదలకు మంచి ఆరోగ్య సౌకర్యాలు అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం అని ప్రధాన మంత్రి అన్నారు. దర్భంగా ఎయిమ్స్ బీహార్ ఆరోగ్య రంగంలో భారీ మార్పు తీసుకువస్తుందని ఆయన అన్నారు.దేశప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించడం, వారి జీవితాలను సులభతరం చేయడం మా ప్రధాన కర్తవ్యమని ప్రధాని మోదీ అన్నారు. దర్భంగా ఎయిమ్స్ నిర్మాణంతో మిథిలా, కోసి, తిర్హట్ ప్రాంతాలతో పాటు, పశ్చిమ బెంగాల్, అనేక పరిసర ప్రాంతాల ప్రజలకు ఆరోగ్య సౌకర్యాలు ఉంటాయి. పొరుగు దేశం నేపాల్ నుండి వచ్చే రోగులు కూడా ఈ ఆసుపత్రిలో చికిత్స పొందగలరు.దేశంలో ఆరోగ్యానికి సంబంధించి మా ప్రభుత్వం సమగ్ర దృక్పథంతో పనిచేస్తోందని ప్రధాని మోదీ అన్నారు. మా మొదటి దృష్టి వ్యాధి నివారణపై ఉంది. వ్యాధిని సక్రమంగా నిర్ధారించడంపై రెండో దృష్టి, ప్రజలకు ఉచితంగా, చౌకగా వైద్యం అందించడం, వారికి తక్కువ ధరకే మందులు అందజేయడం, వైద్యుల కొరతను అధిగమించడం, చిన్న పట్టణాల్లోనూ అత్యుత్తమ వైద్య సదుపాయాలు కల్పించడం నాల్గవ దృష్టి. దేశంలో ఐదవ దృష్టి ఆరోగ్య సేవల్లో సాంకేతికతను విస్తరించడం ముఖ్యమని అన్నారు. ఆయుష్మాన్ భారత్ పథకం దేశంలోని పేదల జీవితాల్లో పెనుమార్పు తెస్తోందని ప్రధాని మోదీ అన్నారు. ఈ పథకం కింద దేశంలో దాదాపు నాలుగు కోట్ల మంది చికిత్స పొందారు. ఆయుష్మాన్ భారత్ పథకం లేకుంటే వీరిలో ఎక్కువ మంది ఆసుపత్రిలో చేరి ఉండేవారు కాదు. ఆయుష్మాన్ యోజన ద్వారా కోట్ల కుటుంబాలు దాదాపు రూ.1.25 లక్షల కోట్లు ఆదా చేశాయని అన్నారు. బిహార్ లోని దర్భంగాలో నిర్వహించిన సభలో ప్రధాని ప్రసంగించారు. దేశవ్యాప్తంగా ప్రజల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా దర్భంగాలో ఎయిమ్స్‌కు ప్రధాని శంకుస్థాపన చేసి, రూ.12,100 కోట్ల విలువైన ప్రాజెక్టులను ఆవిష్కరించారు. బిహార్‌లో నీతీశ్ కుమార్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రధాని ఈ సందర్భంగా కొనియాడారు. ఆటవిక రాజ్యంగా ఉన్న రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి అభివృద్ధి దిశగా నడిపిస్తున్నారన్నారు. గత ప్రభుత్వాలు కేవలం తప్పుడు వాగ్దానాలు మాత్రమే చేశాయని.. కానీ రాష్ట్రంలో నీతీశ్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం పరిస్థితి మెరుగుపడిందని పేర్కొన్నారు. ముందు ముందు రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.


## మీ నాలుగు తరాలొచ్చినా ఆర్టికల్ 370 పునరుద్ధరించలేరు-అమిత్ షా



ఢిల్లీ,,మహారాష్ట్రలో ఎన్నికలు సమీపిస్తున్నాయి. దీంతో ప్రధాన పార్టీలు ప్రచారంలో దూసుకుపోతున్నాయి. తాజాగా ముంబైలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఎన్నికల ప్రచార సభ నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ దేశంలో ఉగ్రవాదం, నక్సలిజం నిర్మూలించారని వ్యాఖ్యానించారు. రాహుల్, మీ నాలుగు తరాలొచ్చినా కశ్మీర్‌లో ఆర్టికల్ 370 పునరుద్ధరణ సాధ్యం కాదు, అని అన్నారు. బీజేపీకి రాజకీయ అధికారం కన్నా కశ్మీర్ సమస్యే హృదయానికి దగ్గరగా ఉంటుందన్నారు.

## ఎన్టీఆర్ నటన కంటే చంద్రబాబు నటన మాములుగా లేదు : వైఎస్ జగన్

అమరావతి : జగన్ ప్రభుత్వం ఫెయిల్ కావాలని ఎన్నికలకు రెండు సంవత్సరాల ముందు నుంచే అంతర్జాతీయ అంశంగా వైసీపీ పాలనపై చంద్రబాబు తప్పుడు ప్రచారం చేశారని వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ ఆరోపించారు. ఈ విషయంలో ఎన్టీఆర్ నటన కంటే చంద్రబాబు నటన మాములుగా లేదని విమర్శించారు. తాడేపల్లి నివాసం నుంచి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ డ్రామా బడ్జెట్‌అని వ్యాఖ్యనించారు. కూటమి ప్రభుత్వం మోసాలు, అబద్ధాలు బయటకు వస్తాయనే ఇంతకాలం బడ్జెట్ పెట్టలేదని విమర్శించారు. అంతేకాకుండా ఇచ్చిన హామీలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదని పేర్కొన్నారు. ప్రజలను మభ్యపెట్టే విధంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని, గవర్నర్ ప్రసంగంలోనూ అబద్ధాలు చెప్పించారని విమర్శించారు.వైసీపీ ప్రభుత్వ పాలనపై చంద్రబాబు ఆర్గనైజ్డ్ క్రిమినల్స్‌లా దుష్ప్రచారం చేశారని విమర్శించారు. రాష్ట్రానికి రూ.10 లక్షల కోట్లని, రూ. 12 లక్షల కోట్లని, రూ. 14 లక్షల కోట్లు అప్పులంటూ తప్పుడు ప్రచారం చేశారని దుయ్యబట్టారు.చివరకు రూ. 6 లక్షల 46 వేల కోట్లు చేసిందని బడ్జెట్‌లో పొందుపరచారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వం కేవలం రూ. 3.13 లక్షల కోట్లు మాత్రమే అప్పు చేసిందని తెలిపారు. ఆర్థిక



వ్యవస్థనూ వైసీపీ హయాంలో సక్రమంగా నిర్వహించామని వెల్లడించారు. చంద్రబాబు హయాంలో అప్పులు 19శాతం పెరిగితే మా హయాంలో 15శాతం అప్పులు పెరిగాయని వివరించారు.ఆర్థిక క్రమశిక్షణ పాటించినందుకు మాకు అవార్డు ఇవ్వాలని, రెండు సంవత్సరాలు కోవిడ్ (అనీలతిట) ఉన్నప్పటికీ చంద్రబాబు కన్న బెటర్ పాలన అందించామని పేర్కొన్నారు. 2014-19 వరకు చంద్రబాబు పాలనలో 42,183 కోట్లు బకాయి పెట్టిపోగా వైసీపీ వాటిని చెల్లించిందని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం దోచుకోవడమే పనిగా పెట్టుకుందని వైఎస్ జగన్ ఆరోపించారు.

## అసెంబ్లీలో డీఎస్సీపై వివరాలు వెల్లడించిన మంత్రి లోకేశ్‌కుమార్

**ప్రశ్నోత్తరాల సమయంలో సమాధానం**



అమరావతి, నవంబర్ 13 : ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు కొనసాగుతున్నాయి. ప్రశ్నోత్తరాల్లో భాగంగా డీఎస్సీపై సభ్యులు అడిగిన పలు ప్రశ్నలకు మంత్రి నారా లోకేష్ సమాధానం ఇచ్చారు. తెలుగుదేశం ఆవిర్భావం తరువాత 11 డీఎస్సీలు వేశారని.. లక్షా 50 వేల మంది ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశారని తెలిపారు. ఇందులో 9 డీఎస్సీలు చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వేసినవే అని చెప్పుకొచ్చారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలి సంతకం మెగా డీఎస్సీ వేశారని.. దానిలో భాగంగా టెట్ తరువాత డీఎస్సీ వెయాలని నిర్ణయించామన్నారు. డీఎస్సీకి త్వరలోనే నోటిఫికేషన్ 16 వేల పైచిలుకు పోస్టులు భర్తీ చేస్తామని ప్రకటించారు. నిరుద్యోగ యువత పోరాటం మూలంగానే 93 శాతం విజయాన్ని అందుకున్నామన్నారు. సూపర్ సిక్స్ మ్యానిఫెస్టోలో తొలి హామీ 20 లక్షల ఉద్యోగాలు అని.. దానికి ఉన్న మంత్రి వర్గ ఉపసంఘంకు తనను ఛైర్మన్‌గా సీఎం చంద్రబాబు నాయుడు నియమించారని తెలిపారు. డీఎస్సీ పై గతంలో ఎన్ని కేసులు పడ్డాయో వాటిని స్టడీ చేయమని అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. అధికారులు తగినంత సమయం కావాలని అడిగారన్నారు. ఇప్పుడు ఇచ్చే నోటిఫికేషన్ పకడ్బందీగా వేయాలని వారికి చెప్పామని తెలిపారు. యుద్ధ ప్రాతిపదికన పెండింగ్ ఉపాధ్యాయ పోస్టులన్నింటినీ వచ్చే ఏడాది భర్తీచేస్తామని ప్రశ్నోత్తరాలు సందర్భంగా మంత్రి లోకేన్ సమాధానం ఇచ్చారు. ప్రశ్నోత్తరాల అనంతరం శాసనసభలో బడ్జెట్‌పై చర్చ ప్రారంభమైంది. ఎమ్మెల్యే కూన రవి కుమార్ చర్చను మొదలుపెట్టారు. 2014లో కేంద్రంలో ఉన్న ప్రభుత్వం అప్రజాస్వామికంగా రాష్ట్రాన్ని విభజించారన్నారు. గత ప్రభుత్వం విధ్వంసంతో పాలనను ప్రారంభించిందని తెలిపారు. రాష్ట్రాన్ని దెబ్బతీసి అన్ని వ్యవస్థలను నాశనం చేశారన్నారు. 2019-24 మధ్య కాలంలోని జగన్ ప్రభుత్వం కంటే బ్రిటిష్ ప్రభుత్వమే మేలంటూ వ్యాఖ్యలు చేశారు. జగన్ వచ్చాక విద్యుత్ ఒప్పందాలను రద్దు చేశారని.. అలాగే నీటిపారుదల రంగాన్ని నిర్వీర్యం చేశారన్నారు. పోలవరం ప్రాజెక్టును నిలిపేశారని... అమరావతిని కూడా నిలిపేశారని మండిపడ్డారు. ఏజెన్సీలు మార్చడం వల్ల డయాఫ్రం వాల్ కొట్టుకుపోయిందనని కూన రవి కుమార్ పేర్కొన్నారు.

## జమ్మూ కశ్మీర్‌లో విదేశీ ఉగ్రవాదులు..!


**యాక్టివ్‌గా 119 మంది ఉగ్రవాదులు..!**

జమ్మూ కశ్మీర్‌లో విదేశీ ఉగ్రవాదులు పెద్ద ఎత్తున కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఉగ్రవాదుల కార్యకలాపాలతో పాటు రిక్రూట్‌మెంట్‌లు నిర్వహించే పద్ధతుల్లో సైతం మార్పులు కనిపిస్తున్నది. సరిహద్దుల్లోకి చొరబడడం మాని అంతర్గత ప్రాంతాల్లో దాక్కొని దాడులకు తెగబడుతున్నారు. ఉగ్రవాదులకు స్థానికంగా తక్కువ మంది మాత్రమే సహకారం అందిస్తున్నట్లుగా సైన్యం వర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రస్తుతం జమ్మూ కశ్మీర్‌లో 119 మంది ఉగ్రవాదులు యాక్టివ్‌గా ఉన్నారని నిఘా వర్గాలు పేర్కొంటున్నాయి. ఇందులో 79 మంది పీర్ పంజాల్‌లో ఉన్నారు. 18 మంది స్థానికులు, 61 మంది పాకిస్థానీ ఉగ్రవాదులు ఉన్నట్లు అంచనా. పీర్ పంజాల్‌కు దక్షిణాన 40 మంది ఉగ్రవాదులు యాక్టివ్‌గా ఉన్నారు. ఇందులో 34 మంది పాకిస్థానీలు కాగా.. ఆరుగురు స్థానిక ఉగ్రవాదులు ఉన్నారు. సమాచారం మేరకు.. ప్రస్తుత సంవత్సరంలో ఇప్పటివరకు 25 ఉగ్రవాద ఘటనలు రికార్డయ్యాయి. ఈ ఘటనల్లో 24 మంది జవాన్లు అమరులయ్యారు. గతేడాది ఈ సంఖ్య 27గా ఉన్నది.ఈ ఏడాది 61 మంది ఉగ్రవాదులు హతమవగా.. ఇందులో ఇంటీరియర్‌లో 45 మంది.. నియంత్రణ రేఖ వద్ద 16 మంది మరణించారు. ఇందులో 21 మంది పాక్ ఉగ్రవాదులు ఉన్నారు. ఇక నార్తర్న్ కమాండ్ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ ఎంవీ సుచీంద్ర కుమార్ వైట్ నైట్ కార్ప్స్‌ని సందర్శించారు. సైనిక సన్నద్ధతపై సమీక్షించారు. అప్రమత్తంగా ఉంటూ ఉగ్రవాదుల కోసం ఆపరేషన్ ముమ్మరం చేయాలని భద్రతా బలగాలను ఆదేశించారు. ఉగ్రవాదుల ఆచూకీ కోసం సైన్యం ప్రత్యేక ఆపరేషన్లు నిర్వహిస్తూ వస్తోన్నది.

## విశాఖ మెట్రోల రైలుపై శుభవార్త

**త్వరలోనే ప్రాజెక్టును ప్రారంభిస్తున్న తెలిపిన మంత్రి నారాయణ**

అమరావతి, నవంబర్ 13 : విశాఖ మెట్రోల రైలుపై మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ శుభవార్త చెప్పారు. త్వరలోనే మెట్రో రైలు ప్రాజెక్టును ప్రారభించనునున్నట్లు అసెంబ్లీ సాక్షిగా మంత్రి తెలిపారు. బుధవారం ఉదయం అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమవగా.. స్పీకర్ ప్రశ్నోత్తరాలు చేపట్టారు. ఈ సందర్భంగా విశాఖ మెట్రో రైల్‌పై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి ఈ మేరకు సమాధానం ఇచ్చారు. 2018లో మెట్రోరైల్ టెండర్‌ల వరకూ వెళ్లిపోయిందని.. అయితే విశాఖపట్నం ఓ ప్యాలెస్ కట్టుకోవడానికే పరిమితం అయ్యారని విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు అన్నారు. కోల్‌కతాలో మొత్తం మెట్రోకు కేంద్రం నిధులు ఇచ్చిందని తెలిపారు. ఈ ప్రాజెక్టు విభజన చట్టంలో ఉందని ఎమ్మెల్యే వెల్లడించారు. మెట్రోరైల్ ఫస్ట్ ఫేజ్‌లో మరో ఆరు కిలోమీటర్లు పెంచితే మరింత ఉపయోగం ఉంటుందని బీజేపీ శాసనసభాపక్ష నేత విష్ణుకుమార్ రాజు అభిప్రాయపడ్డారు.దీనిపై మంత్రి నారాయణ మాట్లాడుతూ.. విభజన చట్టం ప్రకారం ఫీజిబుల్ రిపోర్టు తయారు చేసి ఇవ్వమన్నారని.. 2015లో డీపీఆర్ తయారు చేసి ఇచ్చామని తెలిపారు. అప్పుడు మీడియం మెట్రో అన్నారని.. 2016లో పీపీపీ మాడల్‌లో చెప్పారన్నారు. న్యూ మెట్రో పాలసీ ప్రకారం ధరఖాస్తు చేయమని తరువాత చెప్పారని తెలిపారు. ఢిల్లీ మెట్రో అధికారులు విశాఖ, విజయవాడకు లైట్ మెట్రోను సిఫారస్సు చేశారన్నారు. గతంలో ఇచ్చిన టెండర్లను వైసీపీ ప్రభుత్వం 2019లో క్యాన్సిల్ చేసిందని అన్నారు. అప్పటి ప్రభుత్వానికి మెట్రో చేయాలనే ఉద్దేశమే లేదని విమర్శించారు. అయితే కేంద్రంతో మాట్లాడి కలకత్తా మోడల్‌లో మెట్రో ప్రాజెక్టును ముందుకు తీసుకువవెళతామని స్పష్టం చేశారు. విశాఖ మెట్రో రైల్ ప్రాజెక్ట్‌పై సమగ్ర రవాణా ప్రణాళికను (సీఎంపీ) సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ ప్రణాళికను ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి పంపించినట్లుచెప్పారు. కేంద్రం నుంచి అనుమతి రాగానే ప్రాజెక్ట్ పనులు ప్రారంభిస్తామన్నారు. గత ప్రభుత్వం విశాఖ, విజయవాడకు మెట్రో రైల్



రాకుండా కక్షపూరితంగా పక్కన పెట్టేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖలో భోగాపురం ఎయిర్‌పోర్టు వరకు పొడిగించాలనే సాకుతో డీపీఆర్‌ను నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మెట్రో ప్రాజెక్ట్‌పై స్వయంగా కేంద్రమంత్రిని కలిసినట్లు తెలిపారు.

# సంపాదకీయం

గురువారం 14-11-2024

## రష్యా, ఉక్రెయిన్ యుద్ధం ఫుల్ స్టాపేనా

ఒక వైపు రష్యా–ఉక్రెయిన్ యుద్ధం.. మరోవైపు, మిడిల్ ఈస్ట్‌లో ఇజ్రాయెల్ యుద్ధం.. ఇక, ఆసియాలో నార్త్ కొరియా, చైనాల రెచ్చగొట్టే చర్యలు.. ఇన్ని ఉద్రిక్తతల మధ్య మూడో ప్రపంచ యుద్ధం తప్పదేమో అనుకునే టైమ్‌లో అమెరికాలో ట్రంప్‌కు పెద్దన్న సీటు దక్కింది. తన విక్టరీ మెసేజ్‌లో కూడా నేను యుద్ధాలు చేయడానికి రావట్లేదు యుద్ధాలు ఆపేది నేనే అంటూ ట్రంప్ హామీ ఇచ్చారు. అయితే, తన ప్లాన్ ఏంటో ట్రంప్ క్లారిటీ ఇవ్వలేదుమళ్లీ అధికారంలోకి వస్తా.. యుద్ధాలు ఆపేస్తానని ఎన్నికల ప్రచారంలో వాగ్దానాల మోతమోగించారు డొనాల్డ్ ట్రంప్. నిజానికి, ట్రంప్ గెలుపులో వార్ డీల్ కీలక పాత్ర పోషించిందనడంలో సందేహం లేదు. ప్రస్తుతం ప్రపంచం ఉన్న పరిస్థితుల్లో యుద్ధాలు జరగాలని ఎవ్వరూ, ఏ దేశమూ కోరుకోవట్లేదు. ముఖ్యంగా, అమెరికన్లు శాంతి కావాలని ఆందోళనలు కూడా చేపట్టారు. బైడెన్ ప్రభుత్వం యుద్ధాల విషయంలో తీసుకున్న నిర్ణయాలతో అసహనానికి గురైన అమెరికన్లు, ఎన్నికలకు ముందు భారీగా నిరసనలు చేశారు.ట్రంప్ విజయంలో మస్క్ పాత్రను పక్కన పెడితే.. అమెరికన్లలో పెరిగిన అసంతృప్తి కూడా డెమొక్రాటిక్ పార్టీ పరాజయానికి కారణం అయ్యింది. యుద్ధాన్ని ఆపుతానని చెప్పిన ట్రంప్ గెలిచారు. ఇక, అమెరికా విదేశాంగ విధానంలో భారీగా మార్పులు చేయాలని మొదటి నుంచి చెబుతున్న ట్రంప్.. వలసలు, వ్యాపారం, ఆర్థిక, సైనిక వ్యహారాల్లో విధానపరమైన ఛేంజస్ తీసుకొచ్చే పనితో పాటు? ముఖ్యంగా, యుద్దాలను ఆపడాన్ని కీలకంగా పరిగణించారు. కేవలం 24 గంటల్లోనే రష్యా?ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపుతానని మాట ఇచ్చారు. విజయం సాధించాక ట్రంప్ ఇచ్చిన స్పీచ్‌లో.. కొత్తగా యుద్ధాలు స్టార్ చేయను.. ప్రపంచంలో ఇప్పుడు జరుగుతున్న యుద్ధాలను ఆపుతానని చెప్పారు.ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అనిశ్చితి, యుద్ధాలు వంటి అంశాల్లో ట్రంప్ కీలక నిర్ణయాలు తీసుకుంటారనడంలో సందేహం లేదు. స్పష్టమైన వివరాలు చెప్పకపోయినా, ట్రంప్ విదేశాంగ విధానం గురించి ప్రపంచానికి అనుభవం ఉంది. గత ట్రంప్ అధికారంలో అమెరికా శత్రు దేశాలైన రష్యాతో పాటు చైనా, నార్త్ కొరియాలకు కూడా ట్రంప్ షేక్ హ్యాండ్ ఇచ్చారు. అయితే, ఎన్ని షేక్ హ్యాండ్‌లు, ఎన్ని హ్యాండ్‌లు ఇచ్చినా.. అమెరికాకు 'అమెరికా ఫస్ట్' అనేది మాత్రమే అత్యంత ముఖ్యమైన విదేశీ విధానం. అందుకే, 2017 నుంచి 2021 మధ్య కాలంలో ట్రంప్ పాలన.. ఇటీవల, ఎన్నికల ప్రచారంలో ఆయన చెప్పిన మాటల ఆధారంగా ట్రంప్ విదేశాంగ విధానంపై ఎలా ఉండబోతుందనేది కొంత అంచనా వేయొచ్చు. ముఖ్యంగా, ఉక్రెయిన్–రష్యా యుద్ధాన్ని ఆపడంలో ఏం చేస్తారన్నది ఊహించొచ్చు.రష్యాతో శాంతి చర్చలకు రావాలనే షరతుతోనే ఉక్రెయిన్‌కు అమెరికా ఆయుధాలు సరఫరా చేయాలన్నది గతంలో ట్రంప్ డిమాండ్. దీనితో పాటు, శాంతి చర్చలకు పుతిన్‌ను ఒప్పించాలంటే.. ఉక్రెయిన్‌ను నాటో కూటమిలో చేర్చుకోమని యూరప్ దేశాలు కచ్చితంగా చెప్పాల్సి ఉంది. అలాగే, రష్యా ఆక్రమించిన ఉక్రెయిన్ భూభాగాన్ని తిరిగి ఉక్రెయిన్‌కు అప్పగించాలి. ఇందులో భాగంగా, ప్రస్తుతం ఫ్రంట్ లైన్స్ ఆధారంగా చర్చలు జరపాల్సి ఉంది. అయితే, రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో తనకున్న స్నేహం, మస్క్‌తో ఉన్న బిజినెస్ డీలింగ్ కారణంగా ఉక్రెయిన్ లొంగిపోవాలనే విధంగానే ట్రంప్ డీల్ చేసే అవకాశం ఉంది. అయితే, ఇది యూరప్‌ను ప్రమాదంలోకి నెట్టేస్తుందనడంలో సందేహం లేదు. దీనికి, ఉక్రెయిన్ కూడా ఒప్పుకునే ఛాన్స్ తక్కువే.అయితే, యుద్ధం ఆపేయడానికి 'అమెరికా ఫస్ట్' అనే ట్రంప్ విధానం నాటో భవిష్యత్‌కు సంబంధించి వ్యూహాత్మక సమస్యలకు దారితీస్తుందని నిపుణులు ఇప్పటికే సూచించారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా ఏర్పడిన వివిధ దేశాల సైనిక కూటమే ఈ నాటో. అయితే, అమెరికా డబ్బులతో యూరప్ దేశాలు ఉచితంగా రక్షణ పొందుతున్నాయని నాటో కూటమిపై ట్రంప్ చాలా సార్లు విమర్శలు గుప్పించారు. అందుకే, నాటో కూటమి నుంచి అమెరికా బయటకొచ్చే విధంగా ట్రంప్ చర్యలు ఉంటాయనే వాదన కూడా ఉంది.ఇక, ఇదే జరిగితే, ఈ వందేళ్ల కాలంలో అట్లాంటిక్ దేశాల మధ్య రక్షణకు సంబంధించిన సంబంధాల్లో ఇదో కీలక మార్పును తెస్తుందనడంలో సందేహం లేదు. అయితే, ట్రంప్ వ్యూహంలో నాటో కూటమి నుంచి వైదొలగే అంశం ఉండదన్నది బలంగా వినిపిస్తున్న మాట. ఇది నిజయం కూడా. అందుకే, రక్షణ వ్యవహారాల్లో సభ్య దేశాలు కేటాయించే నిధుల వాటాల్లో మార్పులు తీసుకురావడం వరకే ట్రంప్ మార్పులు చేసే అవకాశం ఉంది. దీనితో, యూరప్ దేశాల్లో అసంతృప్తి వచ్చినప్పటికీ, ఉక్రెయిన్‌కు సహాయం అందించడంలో వాటిని కాస్త దూరం చేయడంలో ట్రంప్ విజయం సాధిస్తారు. ఈ పరిణామం వల్ల, నాటో దేశాలపై ఆధారపడిన ఉక్రెయిన్ బలవంతగానైనా యుద్ధం నుండి విరమించుకోవాల్సి వస్తుంది.ఇక, పశ్చిమాసియాలోనూ శాంతిని నెలకొల్పుతానని ట్రంప్ హామీ కూడా ఇక్కడ ప్రత్యేకంగా నిలుస్తుంది. గాజాలో ఇజ్రాయెల్–హమాస్, లెబనాన్‌లో ఇజ్రాయెల్–హిజ్బుల్లా మధ్య యుద్ధాలను ఆపేస్తానని ట్రంప్ మాట ఇచ్చారు. కానీ, ఎలా చేస్తారన్నది చెప్పలేదు. ఒకవేళ జో బైడెన్ స్థానంలో ట్రంప్ అధికారంలో ఉండుంటే.. హమాస్ ఇజ్రాయెల్‌పై దాడి చేయడానికి సాహసించేది కాదని ట్రంప్ చాలా సార్లు అన్నారు. ఎందుకంటే, హమాస్‌కు నిధులు చేకూర్చే ఇరాన్‌పై ఒత్తిడి తీసుకువచ్చేవాడినని ఆయన తెలిపారు.ఇవన్నీ చూస్తుంటే, తిరిగి పాత ఒప్పందాల వైపు ట్రంప్ మొగ్గుచూపుతున్నారని అర్థమవుతోంది. అంటే, ఇరాన్ అణు ఒప్పందం నుంచి అమెరికా వైదొగలడం, ఇరాన్‌పై కఠిన ఆంక్షలు విధించడం, ఆ దేశానికి చెందిన అత్యంత శక్తిమంతమైన సైనిక కమాండర్ జనరల్ సులేమానీని చంపడం వంటి ఇజ్రాయెల్ అనుకూల నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. ఎందుకంటే, ట్రంప్ మొదటి హయాంలో కూడా ఇజ్రాయెల్‌కు అనుకూలంగా అనేక నిర్ణయాలు తీసుకున్నారు. ఇజ్రాయెల్ రాజధానిగా జెరూసలెంను గుర్తించి యూఎస్ రాయబార కార్యాలయాన్ని అక్కడికి మార్చారు

## నిర్దోషిగా బయటికి వచ్చా ::బైరెడ్డి



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 13–బైరెడ్డి రాజశేఖర్ రెడ్డిపై ఉన్న సాయిశ్వర్ హత్య కేసు కొట్టివేసిన విజయవాడ ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టు కొట్టి వేసిందని నిర్దోషిగా బయటికి వచ్చానని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి ఒ ప్రకటనలో పేర్కొన్నారు. నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గం ముచ్చుమర్రి గ్రామానికి చెందిన సాయిశ్వర్ హత్య కేసు బుధవారం విజయవాడ ఫాస్ట్ ట్రాక్ సాక్ష్యదారాలు నిరూపన కానందున కేసు కొట్టివేస్తూ నిందితులుగా ఉన్న మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి తో పాటు నిందితులందరిని నిర్దోషులుగా ప్రకటిస్తూ తీర్పు చెప్పిందని అన్నారు . 2014 మార్చి నెలలో జరిగిన సాయిశ్వర్ హత్య కేసు సుమారు 12 సంవత్సరాల సుదీర్ఘ విచారణ అనంతరం సాక్ష్యదారాలు నిరూపణ కానందున ఫాస్ట్ ట్రాక్ కోర్టు న్యాయ మూర్తి కేసు కొట్టివేస్తూ తీర్పు చెప్పారన్నారు . రాయలసీమ ఉద్యమం తన నాయకత్వంలో ఉధృతంగా జరుగుతున్న సమయంలో కొందరు తనపై ఈ తప్పుడు కేసు బనాయించారని, కర్నూలు, విజయవాడ ప్రత్యేక కోర్టు ( ఫాస్ట్ ట్రాక్ ) ల చుట్టూ సుమారు 12 సంవత్సరాలనుండి ఎన్నో వ్యయ ప్రయాసాలకు గురై తిరిగామని ఆయన అన్నారు.

## 104 ఉద్యోగుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలి..



విభారె న్యూస్ ఎమ్మిగనూరు నవంబర్ 13.104 ఉద్యోగుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని 104 ఉద్యోగుల సంఘం నాయకులు రాజన్న పెద్దయ్య డిమాండ్ చేశారు. బుధవారం104 ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎమ్మిగనూరు పట్టణంలో ఉండే డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్బంగా ఉద్యోగులు మాట్లాడుతూ తమకి పెండింగ్ ఉన్న వేతనాలు ఇవ్వాలని మరియు కుటుంబాలను పోషించటం చాల కష్టం అవుతుంది అని వాపోయారు. 104 సేవలను ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రము ద్వారా కేవలము 50 వేలు రూపాయల ఖర్చు తో నిర్వహించి ప్రజా దనము వృధాకాకుండా చూడాలి అని 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్, డి.ఈ.ఓ కు జి.ఓ 7 ద్వారా వేతనాలు ఇవ్వాలని అరబిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పి. యఫ్ తిరిగి చెల్లించాలి అని 74 మంది సీనియర్ డ్రైవర్లకు స్లాబ్ అమలు చెయ్యాలి అని డి యస్సి ద్వారా నియమితులు అయిన సీనియర్ డ్రైవర్ లను కాంట్రాక్టు లో పెట్టాలి అని ఉద్యోగులకు ఇన్సూరెన్స్ చేయించాలి అని ఉద్యోగులకు యాజమాన్యం నుండి రావలసిన ఇతర బకాయిలు చెల్లించే విదంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుని ఉద్యోగులకు న్యాయం చెయ్యాలి అని తెలిపారు.ఈ కార్యక్రమం లో 104 ఉద్యోగులు: రాజన్న, పెద్దయ్య, వీరేష్, హరి, చిట్టెమ్మ,నాగరాజు, వెంకటేష్,రాజు,వీరేష్, అయ్యప్ప,తదితరులు పాల్గొన్నారు.

## యుటిఎఫ్ జిల్లా కమిటీలో ఎమ్మిగనూరు డివిజన్ కు ప్రాధాన్యం..



విభారె న్యూస్ ఎమ్మిగనూరు నవంబర్ 13..గూడూరు లో జరిగిన యుటిఎఫ్ స్వర్ణోత్సవాలలో జిల్లా నూతన కమిటీ ఎన్నుకున్నారు ఈ కమిటీ ఎమ్మిగనూరు ప్రాంతంలో వివిధ మండలాల్లో పనిచేస్తూ ఉపాధ్యాయుల సమస్యల పట్ల,విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్న యుటిఎఫ్ నాయకుల కు జిల్లా కమిటీ లో చోటు దక్కడం పైన యుటిఎఫ్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా గౌరవాధ్యక్షులుగా యస్.దావీదు, రాష్ట్ర కౌన్సిలర్లుగా యన్.నాగమణి,జె.ఎల్లప్ప,జిల్లా కార్యదర్శులుగా డి.కౌలన్న,గుమ్మలబాబు,అడిట్ కమిటీ సభ్యులుగా యం.రాజు,ఐక్య ఉపాధ్యాయ పత్రికా కన్వీనర్ గా యు.చంద్రపాల్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షమానికి,సమస్యల పరిష్కారానికి ,ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవడానికి కృషి చేస్తామని తెలిపారు

## జాతీయ స్థాయి ఫుట్బాల్ పోటీలకు ఎంపికైన ఈశ్వర్...




ఎమ్మిగనూరు: అండర్ 19 జాతీయస్థాయి ఫుట్బాల్ పోటీలకు ఎంపికైన ఈశ్వర్

విభారే న్యూస్ ఎమ్మిగనూరు నవంబర్ 13..పట్టణానికి చెందిన ఇంద్రానగర్ వాసి పేదింటి బిడ్డ బోయ ఈశ్వర్ ఇటీవల గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో అండర్–19 ఎస్జిఎఫ్ రాష్ట్రస్థాయి ఫుట్బాల్ ఛాంపియన్ షిప్ పోటీలో మెరికల్లాంటి ఆటను కనబరిచి సత్తా చాటాడు, దీంతో డిసెంబర్ మొదటి వారం మణిపూర్ లో జరిగే జాతీయస్థాయి ఫుట్బాల్ పోటీలకు ఎంపికయ్యాడు, పట్టణంలోని దీక్షా కాలేజీలో ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్న ఈశ్వర్ ను విద్యార్థులు, సిబ్బంది, పట్టణ క్రీడాకారులు అభినందించారు,అయితే ఈశ్వర్ తల్లిదండ్రులు నాగరాజు–లక్ష్మి లు పొట్టకూటి కోసం కూలి నాలి చేసుకుని జీవనం సాగిస్తున్నారు, క్రీడాకారుడు ఈశ్వర్ మాట్లాడుతూ మాది రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబం అయినా మా తల్లిదండ్రులు నన్ను చదివిస్తున్నారు క్రీడలను ప్రోత్సహిస్తున్నారన్నారు, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఆడటం మానలేదన్నారు,నాకు వెన్నంటి ప్రోత్సహిస్తున్న కోచ్ మాబుసాబ్,పిఈటి నరసింహారాజు,వైఎఫ్సి సభ్యులు సర్తాజ్, సుభాన్ ల కఠోర శ్రమ, ఆటలోని మెలుకువలను నేర్పించారన్నారు.

## 16న మండల సర్వసభ్య సమావేశం



విభారె న్యూస్ నవంబర్ 13 ఆళ్లగడ్డ ప్రతినిధి :– ఆళ్లగడ్డ మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 16న శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మహబూబ్ ఖాన్ తెలిపారు. ఈ సమావేశనీ మండల పరిషత్ అధ్యక్షులు గజ్జల రాఘవేంద్ర రెడ్డి అధ్యక్షతన జరుగుతుందన్నారు. కావున ఈ సమావేశానికి ఎంపీటీసీలు, జడ్పిటిసి సర్పంచులు, ఆయా శాఖల అధికారులు హాజరు కావాలన్నారు.

## పౌర్ణమి రోజు కోటి దీపోత్సవం



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 13– మహానంది క్షేత్రంలో ఈనెల 15,వ తేదీన సాయంత్రం 6–30 గంటలకు కార్తీక పౌర్ణమి రోజున జ్వాలాతోరణం,కోటీ దీపోత్సవం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్ శ్రీనివాసరెడ్డి. పేర్కొన్నారు. బుధవారం ఈవో ప్రకటనలో తెలిపారు. వేలాదిమంది భక్తుల సమక్షంలో అత్యంత వైభవంగా నిర్వహించబడుతుందని అన్నారు .జ్వాలా తోరణ దర్శనం సంవత్సరంలో ఒక్కరోజు(కార్తీక పౌర్ణమి రోజు) మాత్రమే చూడగలిగిన కార్యక్రమం అని అన్నారు .ఈ దర్శనం వలన అపమృత్యు,అకాల మృత్యు దోషాలు తొలగిపోయి అనేక విధములైన ప్రమాదముల నుండి రక్షిస్తుందని అన్నారు .మరియు కోటి దీపోత్సవంలో భక్తులందరికీ పాల్గొనే అవకాశం ఉన్నందున స్వయంగా పాల్గొని కోటి దీప కాంతులతో మీరు సైతం ఓ జ్యోతిని వెలిగించి సశాస్త్రీయంగా దీపపూజ చేసి తరించగలరని తెలిపారు .

## పన్నులు త్వరగా వసూలు చేయండి---




నిరంజన్ రెడ్డి మున్సిపల్ కమిషనర్---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 13– : పురపాలక సంఘంలో వివిధ పన్నులను త్వరగా వసూలు చేయా లని కమిషనర్ నిరంజన్ రెడ్డి సిబ్బందికి సూచించారు. పన్నుల వసూళ్లలో వెనకపడిన పలువురు సిబ్బందికి పలు సూచనలు చేశారు . ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పన్నుల వసూళ్లలో వెనకబడిన అధికారుల నుంచి వివరణ కోరామన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం పట్టణంలోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు.

## ఎమ్మిగనూరు నూతన సిఐ గా శ్రీనివాసులు..



విభారె న్యూస్ ఎమ్మిగనూరు నవంబర్ 13..అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నూతన శ్రీనివాసులు హెచ్చరించారు. బుధవారం పట్టణ సిఐగా శ్రీనివాసులు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్న నేరుగా తనను సంప్రదించవచ్చని చెప్పారు. ప్రజలతో మమేకమై ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థను కాపాడుతానన్నారు. చట్ట విరుద్ధంగా కార్యకలాపాలు నిర్వహించే ఎటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు

# సచివాలయ సేవలు వర్సెస్ మీ సేవలు

విజయవాడ, నవంబర్ 13, ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల క్రితం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థతో ప్రజలకు ఒరిగిన మేలేమిటో కానీ చిక్కులు మాత్రం తప్పడం లేదు. గడప వద్దకే సుపరిపాలన నినాదంతో ఆర్భాటంగా ఏర్పాటు చేసిన వ్యవస్థల్లో పౌర సేవల్లో జవాబుదారీతనం తీసుకు రాకుండానే ఐదేళ్లు గడిపేశారు. ఇంటింటికి పెన్షన్ల పంపిణీ మినహా సచివాలయాలతో సాధించిన సాధికారత ఏమిటో నిర్దిష్టంగా చెప్పుకోలేని పరిస్థితి నెలకొంది.ఏపీలో కూటమి ప్రభుత్వం వచ్చి ఐదు నెలలు గడిచిపోయాయి. గ్రామ, వార్డు సచివాలయాలను పునర్వ్యవస్థీకరిస్తామని ప్రభుత్వం ప్రకటించినా అందులో కూడా తాత్సారం కొనసాగుతోంది. కొత్త ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి ప్రతి నెల మొదటి తేదీల్లో ఇంటింటికి పెన్షన్ల పంపిణీ మినహా లక్షా 34వేల సచివాలయ సిబ్బంది ఏ పని లేకుండా పోయింది. గత ప్రభుత్వంలో దాదాపు 23రకాల డిబిటి పథకాలు, నాన్ డిబిటి పథకాలతో ఏటా క్యాలెండర్ ప్రకారం సచివాలయ సిబ్బందికి ఎంతో కొంత పని ఉండేది. ప్రస్తుతం పెన్షన్లు మినహా మిగిలిన పథకాలు నిలిచిపోవడంతో కొన్ని నెలలుగా కార్యాలయాలకు వచ్చి వెళ్లడం మినహా సచివాలయ సిబ్బందికి ఏ పని లేకుండానే గడిచి పోతోంది.వైసీపీ ప్రభుత్వం హడావుడిగా ఏర్పాటు చేసిన గ్రామ, వార్డు సచివాలయాల్లో ఒక్కో సచివాలయానికి సగటున ఎనిమిది సిబ్బందిని నియమించారు. రాష్ట్ర వ్యాప్తంగా 15వేల పైచిలుకు సచివాలయాలు ఉన్నాయి. దశల వారీగా 500కుపైగా పౌరసేవల్ని సచివాలయాల్లో అందిస్తామని జగన్ ప్రభుత్వం పదేపదే చెప్పుకున్నా ఆచరణలో మాత్రం సాధ్యం కాలేదు.ప్రజలకు క్షేత్ర స్థాయిలో పౌరసేవల్ని అందించే రెవిన్యూ, వ్యవసాయం, సివిల్ సప్లైస్, ఎలక్ట్రికల్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్ వంటి మాతృశాఖల ద్వారా ప్రభుత్వ సేవల్ని అందించేందుకు సచివాలయాలను ఏర్పాటు చేశారు. అయితే అయా శాఖల నుంచి అధికారాలను మాత్రం సచివాలయాలకు బదలాయించలేదు. ప్రభుత్వ కార్యాలయాలకు ప్రజలకు మధ్య మరో సమాంతర ప్రభుత్వ వ్యవస్థను ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. సాంకేతికంగా చెప్పాలంటే సచివాలయ సిబ్బందికి ఎలాంటి అధికారాలు లేవు. కేవలం దరఖాస్తుల్ని ప్రాసెస్ చేయడానికి మాత్రమే వారు పరిమితం అయ్యారు. దానినే గ్రామ స్వరాజ్యంగా ప్రచారం చేసుకున్నారు.గ్రామ, వార్డు సచివాలయాల రాకతో అంతకు ముందు ఏర్పాటు చేసిన మీ సేవా కేంద్రాలు మరుగున పడిపోయాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రజలకు పౌరసేవల కోసం ప్రభుత్వ కార్యలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఏపీ టెక్నాలజీ సర్వీసెస్, టీసీఎస్ భాగస్వామ్యంలో మీ సేవా కేంద్రాలను ఏర్పాటు చేశారు. చంద్రబాబు మొదటి సారి ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన సమయంలోనే దశల వారీగా మీ సేవా కేంద్రాల్లో టెక్నాలజీ ఆధారిత పౌర సేవలు అందుబాటులోకి వచ్చాయి.2019లో గ్రామ సచివాలయాలు ఏర్పాటయ్యాక మీసేవా కేంద్రాల అవసరం తగ్గిపోయింది. దీంతో మీ సేవా కేంద్రాలు హైకోర్టును ఆశ్రయించడంతో వారిని కొనసాగించాలని ఆదేశించడంతో కొన్ని చోట్ల అవి కొనసాగుతున్నాయి.సచివాలయాల్లో పౌర సేవలు, ధృవీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చిన ప్రభుత్వం ప్రకటించింది. వాలంటీర్ల ద్వారా దరఖాస్తు చేసినా ఇళ్ల వద్దకే ధృవీకరణ అందిస్తారని చెప్పుకున్నారు. మీ సేవా కేంద్రాల్లో ఇదే రకమైన సేవలు అందేవి. గతంలో 2014-19 వరకు దాదాపు 350రకాల సేవల్ని మీ సేవా కేంద్రాల్లో అందించేవారు.రెవిన్యూ ధృవీకరణ పత్రాలు, క్యాస్ట్, ఇన్‌కమ్, సమీకృత ధృవీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకుంటే స్థానిక ఎమ్మార్వో కార్యాలయాలలో అమోదించిన తర్వాత వాటిని తిరిగి మీసేవా కేంద్రాల్లో ముద్రించి ఇచ్చేవారు.స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించి ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్, ఆస్తులకు సంబంధించిన సర్టిఫైడ్ కాపీలు, ఆస్తులు, వ్యవసాయ భూముల కొనుగోళ్లలో మ్యుటేషన్ పత్రాలను కూడా మీ సేవా కేంద్రాల్లోనే చేసేవారు. ప్రస్తుతం ఈ తరహా సేవలన్ని రద్దు చేశారు. ఆస్తి కొనుగోళ్లలో ఈసీలు కావాలంటే సంబంధిత ఆస్తి నమోదైన రిజిస్ట్రార్ కార్యాలయంలోనే దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. గతంలో రాష్ట్రంలో ఎక్కడి ఆస్తులకు ఎక్కడైనా ఈసీలు పొందే వెసులుబాటు ఉండేది. సచివాలయాల రాకతో అవన్నీ మాయం అయ్యాయి.మీసేవల్లో రద్దైన సేవలను గ్రామ, వార్డు సచివాలయాల్లో అందిస్తున్నారా అంటే అది కూడా లేదు. సచివాలయ సిబ్బంది తాము ప్రభుత్వ ఉద్యోగులు కావడంతో ప్రజల నుంచి అర్జీలను తీసుకుని వాటిని ఆన్‌లైన్ నమోదు చేయడం నమోషీగా భావిస్తున్నారు. దీంతో ప్రజలు తిరిగి మీ సేవా కార్యాలయాలను ఆశ్రయిస్తున్నారు. సచివాలయ ఉద్యోగులు చేయాల్సిన ఉద్యోగాలు, విధులపై జాబ్ ఛార్ట్‌ను ఖరారు చేయకపోవడమే ఈ రకమైన సమస్యకు కారణం అవుతోంది. మహిళా పోలీసు వంటి ఉద్యోగాల్లో ఉన్నవారు విధులు, వారు ఏ పని చేస్తున్నారనే దానిపై కూడా ఇప్పటికీ క్లారిటీ లేదు. పేరుకు పోలీస్ అయినా వారిని యూనిఫాం సిబ్బంది సేవల పరిధిలో చేర్చే విషయంలో న్యాయపరమైన చిక్కులు ఇంకా తొలగలేదు.పౌరసేవల్ని అందించే విషయంలో సచివాలయాలతో గ్రామ స్వరాజ్యం వచ్చేసినట్టేనని గతంలో విస్తృత ప్రచారం చేసుకున్నారు. లైన్ డిపార్ట్‌మెంట్లతో సచివాలయ సిబ్బందికి ఎలాంటి సంబంధం లేకపోవడంతో ప్రజలు దరఖాస్తు చేయడం మొదలుకుని వాటిని పరిష్కరించుకోవడం వరకు అయా శాఖలనే ఆశ్రయించాల్సి వస్తోంది.ఇక సచివాలయాల్లో జారీ చేసే ధృవీకరణ పత్రాల విషయంలో మరో సాంకేతిక సమస్య ఎదురవుతోంది. మీ సేవా కేంద్రాల్లో నిర్ణీత రుసుము చెల్లిస్తే ఎన్ని కాపీలైనా ప్రింట్ చేసే అవకాశం ఉంటుంది. సచివాలయాల్లో ప్రస్తుతం డిజిటల్ కాపీలను మాత్రమే జారీ చేస్తున్నారు. క్యాస్ట్, ఇన్‌కమ్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ వంటి వాటికి ఒక్క కాపీ మాత్రమే మంజూరు చేస్తున్నారు. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు ఆస్తి పంపకాల్లో కీలకం. ఒకటి కంటే ఎక్కువ పత్రాలను మంజూరు చేయకుండా పిడిఎఫ్ కాపీలను మాత్రమే సచివాలయాల్లో జారీ చేస్తున్నారు.సచివాలయాల్లో జారీ చేసే డిజిటల్ కాపీలను మీ సేవా కేంద్రాల్లో ప్రింట్ చేసుకోవాలని ఉద్యోగులు ఉచిత సలహాలు ఇస్తున్నారు. పిడిఎఫ్ కాపీలకు ఎవరైనా నకిలీ పత్రాలను సృష్టిస్తే తాము చిక్కుల్లో పడతామని, సచివాలయాలు జారీ చేసే పత్రాలను ముద్రించడానికి మీ సేవా కేంద్రాలు నిరాకరిస్తున్నాయి.

# ఈ సారి కేడర్ కు ప్రాధాన్యం

కడప, నవంబర్ 13, వైసీపీ అధినేత జగన్ మొన్నటి ఎన్నికలతో చాలా వరకూ డీలా పడిపోయారు. ఆయన ఊహించని అపజయాన్ని చవి చూశారు. ఆయన అంచనాలకు అందని ఓటమి ఇది. ఎన్నికలకు సంబంధించి ఈవీఎంలు కారణమని ఆయన చెబుతున్నప్పటికీ ప్రజల్లో కూడా కొంత వ్యతిరేకత వస్తుందని ఆయనకు అర్థమయింది. క్యాడర్ కూడా తమకు సరిగా సహకరించలేదని పూర్తిగా అర్థమయింది. సొంత జిల్లా కడపతో పాటు రాయలసీమలోని అన్ని జిల్లాల్లో కూటమి దాదాపు ఎక్కువ స్థానాలలో విజయం సాధించడంతో ఆయనకు ఏం జరిగిందో కూడా అర్థం కావడం లేదు. కనీసం ఓటమికి గల కారణాలను వెతుక్కునేందుకు కూడా జగన్ సిద్ధపడటం లేదు. ఎందుకంటే ఏ కారణం వెతికినా.. చివరకు ఓటమికి ప్రధాన కారణం తనవైపు అన్ని వేళ్లు చూపిస్తుండటమేనని అనుకోవాలి. తన పోకడ వల్లనే వైసీపీ క్యాడర్ దూరమయిందని ఆయనకు తెలిసినా జరగాల్సిన నష్టం జరిగిపోయింది. అందుకే ఈసారి అధికారంలోకి వస్తే కార్యకర్తలకు ప్రాధాన్యత ఇస్తానని పదే పదే చెబుతున్నారు. సామాజిక వర్గాల నినాదం కూడా పనిచేయలేదు. అభ్యర్థులను మార్చినా ఫలితం మారలేదు. ఎన్ని కోట్ల రూపాయలు బటన్ నొక్కి లబ్దిదారుల ఖాతాల్లో చెప్పిన సమయానికి జమ చేసినా ఈవీఎంల బటన్ మాత్రం తనకు అనుకూలంగా పడలేదు. దీంతో తాను చేసిన తప్పొప్పులను జగన్ లోలోపల సమీక్షించుకునే పరిస్థితికి వచ్చారు. మరోవైపు ఒంటరిపోరాటం కూడా ఓటమికి ఒక కారణంగా ఆయన చూస్తున్నారు. చంద్రబాబు నాయుడు కూటమి గట్టినప్పుడల్లా విజయం సాధించి ముఖ్యమంత్రి అవుతున్నారు. ఓట్లు బదిలీ జరగడంతో పాటు పోలింగ్ కేంద్రాల వద్ద సరైన విధంగా ఏర్పాట్లు, క్యాడర్ అందుబాటులో ఉండేందుకు పొత్తు ఉపయోగపడుతుందన్నది చంద్రబాబు ఆలోచన కార్యరూపం దాల్చిన తర్వత జగన్ కూడా అర్థమయింది. అందుకే జగన్ ఆలోచనల్లో కూడా మార్పు వస్తున్నట్లు కనిపిస్తుంది. ఈసారి ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసే కంటే పొత్తులతో కలసి వెళ్లడం మంచిదన్న అభిప్రాయంతో జగన్ ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. దీని వల్ల ప్రతిపక్ష బలం పెరగడం అటుంచి.. నైతికంగా మద్దతు లభిస్తుందని ఆయన అభిప్రాయపడుతున్నారు. అయితే ఏ పార్టీతో పొత్తు పెట్టుకోవాలన్న దానిపై జగన్ ఇంకా ఒక నిర్ణయానికి రాలేదు. కాంగ్రెస్ తో చేతులు కలపలేరు. అలాగే కూటమిలో ఉన్న బీజేపీని బయటకు తెచ్చి పొత్తు పెట్టుకోలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో జగన్ చూపు వామపక్ష పార్టీలపై పడిందని చెబుతున్నారు. కొన్ని స్థానాలు ఇచ్చి కూటమి ఏర్పాటు చేసుకుంటే తనకు నైతిక బలం పెరుగుతుందని, వాయిస్ కూడా ఎక్కువవుతుందని జగన్ భావిస్తున్నట్లు తెలియవచ్చింది. అయితే ప్రతిపాదన వారి నుంచి వస్తే జగన్ కాదనలేని పరిస్థితిలో ఉన్నారు. జగన్ మాత్రం నేరుగా వారి వద్దకు పొత్తుకు రా.. రా రమ్మని మాత్రం అడగరట. వామపక్షాలు వస్తామంటే కాదనరట. మరి పొత్తులతో వచ్చే ఎన్నికలకు జగన్ సిద్ధమవుతున్నారన్న ప్రచారం మాత్రం ఫ్యాన్ పార్టీలోనే జోరుగా సాగుతుంది.

# 2 నెలల తర్వాతే డీఎస్సీ...,,

గుంటూరు నవంబర్ 13, అసెంబ్లీ సమావేశాల సందర్భంగా విద్యా శాఖ మంత్రి లోకేష్‌ను.. పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేవస్ లక్ష్మణరావు కలిశారు. వీరిద్దరి మధ్య డీఎస్సీ నోటిఫికేషన్ గురించి చర్చ జరిగింది. అయితే.. ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తయిన తరువాతే డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తామని, మరో రెండు నెలల సమయం పట్టొచ్చని తనతో మంత్రి లోకేష్ చెప్పినట్లు.. ఎమ్మెల్సీ కేవస్ లక్ష్మణరావు వెల్లడించారు.ఇప్పటికే రాష్ట్రంలో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ కోసం లక్షలాది మంది అభ్యర్థులు ఎదురు చూస్తున్నారు. తొలిత 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ నవంబర్ 3న విడుదల చేస్తామని షెడ్యూల్ చేశారు. నారా లోకేష్ విదేశీ పర్యటనలో ఉండటంతో వాయిదా పడింది. ఆ తరువాత నవంబర్ 6న నోటిఫికేషన్ విడుదల చేస్తామని ప్రకటించారు. అప్పుడు కూడా నోటిఫికేషన్ వాయిదా పడింది. ఈ నేపథ్యంలో మంత్రి లోకేష్ త్వరలోనే నోటిఫికేషన్ విడుదల చేస్తామని జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా ప్రకటించారుఅయితే ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణకు మార్గదర్శకాలు విడుదల చేయకుండా, ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ పూర్తి చేయకుండా మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడానికి లేదని.. ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ప్రకటించారు. దీంతో కూటమి ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణపై కసరత్తు ప్రారంభించింది. ఎస్సీ వర్గీకరణ పూర్తయిన తరువాతే, మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆ విషయాన్ని ఎమ్మెల్సీ కేవస్ లక్ష్మణరావుకి మంత్రి నారా లోకేష్ వివరించారు.డీఎస్సీ అభ్యర్థులకు మరో కీలక అప్‌డేట్ ఇచ్చారు మంత్రి ఎస్.సవిత. ఈనెల 16 నుంచి బీసీ స్టడీ సర్కిల్స్ ఆధ్వర్యంలో ఉచిత డీఎస్సీ కోచింగ్ ప్రారంభం అవుతుందని తెలిపారు. డీఎస్సీ పరీక్షలకు సన్నద్ధమయ్యే బీసీ అభ్యర్థులకు స్టడీ సర్కిళ్ల ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్ ఇవ్వాలని నిర్ణయించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 26 జిల్లా కేంద్రాల్లోనూ బీసీ స్టడీ సర్కిళ్లలో డీఎస్సీ కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు.గుంటూరులో డీఎస్సీ కోచింగ్ సెంటర్లను తాను ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు. ఒక్కో కోచింగ్ సెంటర్‌లో 200 మంది అభ్యర్థులకు కోచింగ్ ఇవ్వనున్నట్లు వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 5,200 మందికి కోచింగ్ ఇవ్వనున్నామన్నారు. బీసీలకు 66 శాతం, ఎస్సీలకు 20 శాతం, ఎస్టీలకు 14 శాతం చొప్పున సీట్లు కేటాయించామన్నారు. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 520 సీట్లు అదనంగా కేటాయించామన్నారు. రెండు నెలల పాటు ఇవ్వనున్న ఉచిత డీఎస్సీ కోచింగ్ సమయంలో.. నెలకు రూ.1,500 చొప్పున స్టైఫండ్ అందజేయనున్నట్లు తెలిపారు. మెటీరియల్ కోసం అదనంగా మరో రూ.1,000 ఇవ్వనున్నామన్నారు.ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లోనూ డీఎస్సీ ఉచిత కోచింగ్ ఇవ్వనున్నామని మంత్రి సవిత వివరించారు. ఇందుకోసం ప్రత్యేక యాప్ రూపకల్పన చేశామన్నారు. ఈ యాప్‌లో సబ్జెక్టుల వారీగా నిపుణులైన వారితో క్లాసుల నిర్వహిస్తున్నామన్నారు. క్లాసులతోపాటు ఈ యాప్‌లో పాత క్వశ్చన్ పేపర్లు, మోడల్ పేపర్లు కూడా అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు.బీఈడీ అర్హతతో పాటు టెట్‌లో ఉత్తీర్ణత సాధించిన వారికే ఆన్ లైన్, ఆఫ్ లైన్ కోచింగ్ ఇవ్వనున్నట్టు మంత్రి స్పష్టం చేశారు. ఆన్ లైన్ అభ్యర్థులకు తమకిష్టమైన సమయాల్లో యాప్‌ను ఓపెన్ చేసుకుని క్లాసులు వినే అవకాశం కల్పించారు. ఆన్ లైన్ కోచింగ్‌తో గృహిణులకు, ప్రైవేటు, ప్రభుత్వ రంగంలో పనిచేసే పార్ట్ టైమ్ ఉద్యోగులకు ఎంతో మేలు కలుగుతుందన్నారు.

# సైనికుల్లో కానరాని ఉత్సాహం...

కాకినాడ, నవంబర్ 13, ఎన్నికలకు ముందు జనసైనికుల అంచనాలు వేరుగా ఉన్నాయి. తమ నాయకుడు శాసించే స్థాయిలో ఉంటారని భావించారు. అయితే నామినేటెడ్ పోస్టుల భర్తీ చూసిన తర్వాత జనసైనికుల్లో ఒకింత నిరుత్సాహం ఏర్పడింది. తాము ఎన్నికలకు ముందు ఊహించుకుంది వేరు.. ప్రస్తుతం జరుగుతున్నది వేరుగా ఉండటంతో ఒకింత నిరాశకు లోనవుతున్నారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా జనసైనికుల్లో పెద్దగా ఉత్సాహం కనిపించడం లేదు. కనీసం పట్టుబట్టి పదవులు సాధించుకోవాల్సిన సమయంలోనూ జనసేన అధినేత పవన్ కల్యాణ్ అవలంబిస్తున్న ధోరణి వారికి మింగుడుపడకుండా ఉంది. అయితే బయటకు కక్కలేక, మింగలేక అవస్థలుపడుతున్నారు.ఊహించుకున్నట్లుగా.కూటమి ఏర్పాటుకు పవన్ కల్యాణ్ కావడంతో అధికారంలోకి వస్తే ఖచ్చితంగా పవన్ కల్యాణ? తో పాటు జనసేనకు కూడా ప్రాధాన్యత ఉంటుందని భావించారు. కేబినెట్ లోనూ మూడు మంత్రి పదవులు ఇవ్వడంతో కొంత తేలిపోయారు. ఇప్పుడు నామినేటెడ్ పోస్టుల రెండు జాబితాల్లోనూ తమకు అన్యాయం జరిగిందన్న ఫీలింగ్ లో గాజు గ్లాస్ పార్టీ కార్యకర్తలున్నారు. పార్టీ జెండాను పట్టుకున్న వారికి పదవులు ఇవ్వాల్సిన సమయంలో పవన్ కల్యాణ్ పట్టుబట్టకుండా టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఏది ఇస్తే అది తీసుకునేందుకు సిద్ధపడటంతో ఒకింత ఇబ్బందిగా ఫీలవుతున్నారు. ఈపరిస్థితిని తాము ఊహించలేదంటున్నారు.. నిజానికి పవన్ కల్యాణ్ పట్టుబడితే మరికొన్ని నామినేటెడ్ పోస్టులు జనసేన నేతలకు దక్కి ఉండేవనభావన వ్యక్తమవుతుంది. జమిలి ఎన్నికలు వస్తున్నాయన్న నేపథ్యంతో పాటు 2027 ఎన్నికల్లో కలసి పోటీ చేయాలన్న ఉద్దేశ్యంతో ఉన్న చంద్రబాబు నుంచి వీలయినన్ని పదవులను సంపాదించి పార్టీని బలోపేతం చేసుకోవాల్సిన సమయంలో పవన్ కల్యాణ్ ఇలా వ్యవహరించడమేంటన్న ప్రశ్నలు సహజంగానే కార్యకర్తల్లో వినిపిస్తున్నాయి. పార్టీ కోసం నిరంతరం శ్రమించిన వారిని కాదని, వేరే వారికి పదవులు ఇవ్వడం, రాష్ట్ర కార్యాలయంలో టచ్ లో ఉన్నవారికే ఎక్కువ పదవులు కట్టబెట్టడం కూడా జనసైనికుల కోపానికి కారణంగా కనిపిస్తుంది. అయితే అది పెద్ద స్థాయిలో కనిపించకపోయినప్పటికీ పవన్ కల్యాణ్ ను నేరుగా ప్రశ్నించడానికి కూడా వారికి అవకాశం లేదు. ప్రశ్నించిన వారికి సరైన సమాధానం లేకపోగా పక్కన పెడుతుండటం కూడా వారి మౌనానికి కారణంగా తెలుస్తుంది. తమకు అవకాశం ఉన్నప్పుడు పదవులతో పార్టీని బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందని గుర్తించకుండా కేవలం అధికార పార్టీని కీర్తిస్తూ ఉండటం వల్ల పార్టీ ఎలా బలోపేతం అవుతుందన్న ప్రశ్న కింది స్థాయి క్యాడర్ నుంచి వినిపిస్తుంది. దీంతో జనసైనికులు ఇప్పటికిప్పుడు బయట పడకపోయినా.. పవన్ కల్యాణ్ వ్యవహరిస్తున్న తీరు మీద మాత్రం ఒకింత అసంతృప్తి .. అసహనం మాత్రం బయలుదేరిందనే చెప్పాలి.

# విజయసాయిరెడ్డికి ఎందుకంత ప్రేమ

విశాఖపట్టణం, నవంబర్ 13,టీడీపీ నేతలపై ఆ వైసీపీ నేతకు ఉన్నట్లుండి ఒక్కసారిగా ప్రేమ, ఆప్యాయత, అనురాగాలు చిగురించాయి. ఏకంగా ఆ నేతలకు సంఘీభావంగా ట్వీట్ కూడా చేశారు ఆ వైసీపీ నేత. వారికి అన్యాయం జరుగుతోంది.. నేను ఒప్పుకోననే రీతిలో ఆ నేత ట్వీట్ చేసిన తీరుకు సొంత పార్టీ నేతలే షాకయ్యారట. ఇంతకు ఆ నేత ఎవరో తెలుసా.. సాక్షాత్తు వైసీపీ నేత విజయసాయిరెడ్డి.మాజీ సీఎం జగన్ సొంత జిల్లా కడప. ఈ జిల్లాలో ఎన్నికల వేళ ప్రజలు ఇచ్చిన తీర్పు వైసీపీకి షాక్ అని చెప్పవచ్చు. ఉమ్మడి జిల్లా పరిధిలో కేవలం 3 ఎమ్మెల్యే సీట్లు మాత్రమే వైసీపీకి దక్కాయి. మిగిలిన సీట్లన్నీ టీడీపీ కూటమి సొంతమయ్యాయి. జిల్లా కేంద్రమైన కడప నియోజకవర్గం కూడా టీడీపీ వశమైంది. 2019 ఎన్నికలలో వైసీపీ క్లీన్ స్వీప్ చేయగా, 2024 ఎన్నికలకు మాత్రం టీడీపీ కూటమి హవా సాగింది. అయితే ఎంతైనా మాజీ సీఎం జగన్ స్వంత జిల్లా కావడంతో, ఈ ఫలితాలు కొంచెం వైసీపీకి మింగుడు పడని పరిస్థితి. ఊహించని ఫలితాలతో టీడీపీ ఈ జిల్లాలో కూడా జోష్ పెంచిందని చెప్పవచ్చు.తరుణంలో తాజాగా వైసీపీ నేత, ఎంపీ విజయసాయిరెడ్డి ఏకంగా కడప టీడీపీ నేతలకు మద్దతుగా ఓ ట్వీట్ చేశారు. ఆ ట్వీట్ ద్వారా తాను టీడీపీ నేతలకు మద్దతుగా ఉన్నట్లు చెప్పకనే చెప్పారు విజయసాయిరెడ్డి.ఇంతకు ఆ ట్వీట్ లో ఏముందంటే.. మాజీ సీఎం జగన్ స్వంత జిల్లా కడప జిల్లా టీడీపీ నేతలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, ఇటీవల ప్రకటించిన తిరుమల తిరుపతి దేవస్థానం కమిటీలో కూడా చోటు దక్కలేదని, అలాగే నామినేటెడ్ పదవుల్లో సరిపడా పదవులు లేకపోవడంతో కడప నుండి టీడీపీ, స్వంత నేతలను కూడా పక్కన పెడుతోందని విమర్శించారు. అంతేకాదు రెండు సంవత్సరాలలోగా తప్పనిసరిగా కడప టీడీపీ నేతలందరూ వైసీపీలో చేరడం ఖాయమంటూ జోస్యం చెప్పారు.ఈ ట్వీట్ ను చూస్తే కడప టీడీపీ నేతలను రెచ్చగొట్టే ధోరణిలో వైసీపీ ప్రయత్నిస్తుందని టీడీపీ నేతలు అంటున్నారు. ఎవరికి ఎప్పుడు ప్రాధాన్యత ఇవ్వాలన్నది తమ పార్టీ అధినేత అభిప్రాయమని, ఇటువంటి వాటిని తాము లెక్క చేసేది లేదంటున్నారు టీడీపీ నేతలు. ఏదిఏమైనా టీడీపీ నేతలపై విజయసాయి రెడ్డి ఆప్యాయత అనురాగాలు చూస్తుంటే, వైసీపీ చూపు కడప వైపే ఉందన్న అభిప్రాయం కూడా వ్యక్తం చేస్తున్నారు రాజకీయ విశ్లేషకులు.

# గుమ్మడి వర్సెస్ జేసీ...

అనంతపురం, నవంబర్ 13, ఏపీ రాజకీయాల్లో రాయలసీమ ప్రాంతం కీ రోల్ పోషిస్తుంటుంది. కానీ ఉమ్మడి అనంతపురం జిల్లా గుంతకల్ నియోజకవర్గం మాత్రం సైలెంట్ గానే ఉండేది. ఏపీ విభజన తర్వాత ఒకసారి టీడీపీ తరపున జితేంద్ర గౌడ్.. వైసీపీ తరపున వెంకట్రామిరెడ్డి గెలిచారు. ఇద్దరు కూడ ఎక్కడ పెద్దగా వార్తల్లో నిలిచేవారు కాదు. వీరిద్దరిపై కూడా పెద్దగా రాజకీయ ఆరోపణలు లేవు. పెద్దగా వార్తల్లో నిలవని ఈ నియోజకవర్గాన్ని తన ఎంట్రీతోనే హాట్ టాపిక్ గా మార్చారు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం. వైసీపీ హయాంలో కర్నూలు జిల్లా ఆలూరు ఎమ్మెల్యేగా గెలుపొంది. 2022లో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో మంత్రిగా ఛాన్స్ కొట్టేశారు. గత ఎన్నికల సమయంలో గుమ్మనూరు జయరాంను ఆలూరు నుంచి తప్పించి కర్నూలు ఎంపీ అభ్యర్థిగా ప్రకటించింది వైసీపీ. ఆలూరు ఇన్‌చార్జ్‌గా జయరాం వ్యతిరేక వర్గానికి చెందిన జడ్పీటీసీ విరుపాక్షను ప్రకటించింది. దాంతో అలకబూనిన జయరాం.. టీడీపీ గురికి చేరి.. గుంతకల్ ఎమ్మెల్యేగా గెలుపొందారు.గుమ్మనూరు జయరాం ఎమ్మెల్యేగా గెలిచే వరకు బాగున్నా.. ఆ తర్వాత తన సోదరులను, కుమారుడిని నియోజకవర్గంలో పెట్టి.. ఏదో చుట్టపుచూపుగా నియోజకవర్గానికి వస్తూ పోతున్నారని విమర్శలు వస్తున్నాయట. గుంతకల్ లో తన కుమారుడిని.. గుత్తిలో తన సోదరుడికి బాధ్యతలు అప్పగించి.. ఆయన మాత్రం ఆలూరు పైనే ఫోకస్ పెంచారట. ఇక్కడ సోదరుడు, కుమారుడు షాడో ఎమ్మెల్యేలుగా అధికారం చెలాయిస్తున్నారని.. ప్రత్యర్థి పార్టీతో పాటు అధికారపక్షం సభ్యులు కూడ పెద్ద ఎత్తున రాజకీయ ఆరోపణలు చేస్తున్నారట.ఇదంతా ఒక ఎత్తైతే.. రాష్ట్రంలో మొట్టమొదటిగా ఇసుక అక్రమణా రవాణా స్టార్ట్ అయింది గుంతకల్ నియోజకవర్గం నుంచి అని పెద్దఎత్తున వార్తలు వచ్చాయి. అందులోనూ పక్క నియోజకవర్గం అయిన తాడిపత్రిలో.. ఇసుక అక్రమ రవాణా చేస్తుండడంతో అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. దీనిపై తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే ప్రస్తుతం మున్సిపల్ చైర్మన్ జేసీ భాకర్ రెడ్డి.. ఆ సదరు ఎమ్మెల్యే పేరు చెప్పకుండానే.. వార్నింగ్ ఇస్తున్న అంటూ సంచలనం రేపారు. ఒకవేళ నా నియోజకవర్గంలో నువ్వు వేలు పెడితే.. నేను నీ నియోజకవర్గంలో ఎంటర్ అవ్వాల్సి వస్తుంది అంటూ స్టేట్మెంట్ ఇవ్వడం కలకలంగా మారిందట.రేషన్ బియ్యం రవాణాలో కూడా గుంతకల్ నియోజకవర్గం నుంచే స్టార్ట్ అయ్యిందని వాదనలు వినిపిస్తున్నాయట. దీనిపై విచారణ జరిపి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారట. అంతే కాకుండా మద్యం షాపులు టెండర్లపై కూడా ఎమ్మెల్యే వర్గీయులే పెత్తనం సాగించారని టీడీపీ నేతలే ఆరోపిస్తున్నారట. ఇక ఇటీవల ఓ టీడీపీ మహిళ కార్యకర్త తన భూమిని ఎమ్మెల్యే బంధువులు కబ్జా చేశారని ధర్నా చేయడంతో వారి అనుచరగణం టెన్సన్ లో పడ్డారట. దీంతో ఎమ్మెల్యే హుటాహుటిన జిల్లా కలెక్టర్ ని కలిసి.. తన పేరుతో కొంతమంది బెదిరింపులకు పాల్పడుతున్నారని ఫిర్యాదు చేశారట.మరోవైపు ఎమ్మెల్యేపై వస్తున్న ఆరోపణల సంగతి అటు ఉంచితే.. గెలిపించిన నియోజకవర్గాన్ని పట్టించుకోకుండా.. ఆలూరు పైనే దృష్టిని సారించారని చర్చ నడుస్తోందట. అటువైపు కూడా వచ్చి పలకరించకుండా ఉంటున్నారని కూటమి నేతలు మండిపడుతున్నారట. ఇటీవల అనంతపురం జిల్లాలో డీఎస్పీ ల పాసింగ్ ఔట్ పరేడ్ కు హోం మంత్రి అనిత, డీజీపి ద్వారక తిరుమల రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారట. తొలిసారిగా అనంత పర్యటనకు వచ్చిన హోం మంత్రిని కలిసేందుకు జిల్లాలో అందరు ఎమ్మెల్యేలు వచ్చారట. కానీ ఒక్క గమ్మనూరు జయరాం మాత్రమే ఆ కార్యక్రమానికి హాజరు కాకపోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారట.నాడు వైసీపీలో ఫైర్ బ్రాండ్ అనిపించుకొని.. టీడీపీ గూటికి చేరిన ఎమ్మెల్యే జయరాం తనపై వస్తున్న ఆరోపణలకు ఏ విధంగా చెక్ పెడతారు

# మియాపూర్ లో బాలిక కిడ్నాప్

## పెద్దాపురంలో కాపాడిన పోలీసులు

కాకినాడ,హైదరాబాద్ మియాపూర్ లో కిడ్నాప్ చేసి పెద్దాపురంలో పరదేశమ్మ కాలనీలోని ఓ ఇంట్లో నిర్బంధించిన పదేళ్ల బాలికను పెద్దాపురం పోలీసులు కాపాడారు. కొత్త ఆనంద్ అనే యువకుడు బాలికకు మాయమాటలు చెప్పి పెద్దాపురం తీసుకొచ్చి అద్దె ఇంట్లో నిర్బంధించాడు. బాలిక, ఆనంద్ ఎక్కిన ఆటో డ్రైవర్ కు అనుమానం రావడంతో పెద్దాపురం పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఆటో డ్రైవర్ ఇచ్చిన సమాచారంతో పెద్దాపురం ఎస్ఐ మౌనిక కానిస్టేబుల్ బాలాజీ, బాలికను నిర్బంధించిన ఇంటికి చేరుకుని ఇంటి తలుపులు బద్దలు కొట్టి బాలికను కాపాడారు.

# మోటార్ సైకిల్ దొంగ అరెస్టు

**ఎనిమిది మోటార్ సైకిళ్ల స్వాధీనం**

**ప్రజలు తమ వాహనాల పట్ల జాగ్రత్తలు వహించండి**

**ఆళ్లగడ్డ డి.ఎస్.పి రవికుమార్**





విభారె న్యూస్ నవంబర్ 13 ఆళ్లగడ్డ ప్రతినిధి :- జిల్లా ఎస్పీ అది రాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు పలు బైక్ దొంగతనాల కేసులలో జరుగుతున్న దర్యాప్తులో భాగంగా ఆళ్లగడ్డ డిఎస్పి రవికుమార్ పట్టణ సీఐ చిరంజీవి, ఆధ్వర్యంలో నిఘా ఉంచినట్లు డిఎస్పి రవికుమార్ బుధవారం తెలిపారు. అందులో భాగంగా ఆళ్లగడ్డ మరియు పలు ప్రాంతాలలో జరిగిన వివిధ బైక్ దొంగతనాల కేసులో నిందితుడు శెట్టి లక్ష్మీ కుమార్ అనే వ్యక్తిని అరెస్టు చేసి 7,70,000 విలువచేసే 8 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఆళ్లగడ్డ డి.ఎస్పీ రవికుమార్ తెలిపారు. ఆళ్లగడ్డ అర్బన్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ పలు మోటార్ సైకిల్ల చోరీ కేసులలో లక్ష్మీ కుమార్ నిందితుడు అన్నారు. ముద్దాయిని కోర్టుల హాజరపరిచి రిమాండ్ కు పంపుతున్నట్లు డి.ఎస్.పి రవికుమార్ తెలిపారు. ఈ కేసులో చక్కని ప్రతిభ చూపి నిందితులను పట్టుకునేందుకు కృషిచేసిన పట్టణ ఎస్ఐ నగిన , హెడ్ కానిస్టేబుల్ గంగాధర్ , కానిస్టేబుల్స్ సుబ్బరాజు, మహమ్మద్ రఫీ , కాసిం పోలీస్ సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. ప్రజలు తమ మోటార్ సైకిల్ లను పార్కింగ్ చేసినప్పుడు జాగ్రత్తలు వహించాలని, డైనమిక్ లాకింగ్ సిస్టం ఏర్పాటు చేసుకోవాలని డీఎస్పీ రవికుమార్ సూచించారు. ఈ సమావేశంలో టౌన్ సిఐ చిరంజీవి, టౌన్ ఎస్ఐ షేక్ నగీనా , సిబ్బంది పాల్గొన్నారు.

# ఇసుక డిపోల నిర్వహణకు దరఖాస్తుల చేసుకోండీ---

**జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా---**

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 13- జిల్లాలోని ఆత్మకూరు, డోన్ నియోజకవర్గాలలో ఇసుక రీచ్ లు లేనందున ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు చిన్న తరహా వినియోగదారుల కోసం ప్రైవేటు వ్యక్తుల ఆధ్వర్యంలో ఇసుక డిపోలు నిర్వహించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆత్మకూరు నియోజకవర్గ ఇసుక నిల్వ కేంద్రంలో టన్ను ఇసుక రూ. 884/-లు, డోన్ నియోజకవర్గ ఇసుక నిల్వ కేంద్రంలో టన్ను రూ. 744/- చొప్పున ధర నిర్ణయించినట్లు కలెక్టర్ తెలిపారు. సదరు దరఖాస్తు చేసుకునే ప్రైవేట్ వ్యక్తులకు గనుల శాఖ మినరల్ డీలర్ లైసెన్సు మంజూరు చేస్తుందన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ఈ ధరకు మాత్రమే ఇసుక సరఫరా చేయాల్సి వుంటుందన్నారు.. నిల్వ కేంద్రాలు ఏర్పాటు చేయాలనుకునేవారు స్వంతభూమి, రవాణా వాహన వివరాలు కలిగిన పత్రాలతో ఈనెల 19వ తేదీలోగా నంద్యాల పట్టణం బొమ్మల సత్రం సమీపంలో ఉన్న క్రాంతి నగర్ లోని జిల్లా భూగర్భ గనుల శాఖ అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



# సాగునీటి సంఘాల ఎన్నికలకు సర్వం సిద్ధం...




విభారె న్యూస్ నవంబర్ 13 ఆళ్లగడ్డ ప్రతినిధి :- ఆళ్లగడ్డ మండలంలోని పలు సాగునీటి సంఘాల ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు మండల తహసిల్దార్ జ్యోతి రత్నకుమారి తెలిపారు. బుధవారం తమ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆళ్లగడ్డ మండలంలోని మైనర్ ఇరిగేషన్, కె సీ కెనాల్, తెలుగు ఆయకట్టు కింద మొత్తం 14 సాగునీటి సంఘాలు ఉన్నాయన్నారు. అలాగే 116 టి.సీలు గుర్తించడం జరిగిందన్నారు. సాగునీటి సంఘాలు టీ సీలకు ప్రభుత్వం త్వరలో ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి ఓటర్ లిస్టును సిద్ధం చేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయకట్టు దారుల వివరాలను తహసిల్దార్ వెల్లడించారు. ఓటర్ లిస్టులను ప్రిపేర్ చేసి తుది జాబితా సిద్ధంగా ఉంచడం జరిగిందని అన్నారు. జిల్లా కలెక్టర్ అనుమతితో త్వరలోనే ఫైనల్ పబ్లికేషన్ విడుదల చేయడం జరుగుతుందన్నారు. ఎన్నికల నిర్వహణకు పోలింగ్ కేంద్రాలను కూడా గుర్తించడం జరిగిందన్నారు. మైనర్ ఇరిగేషన్, తెలుగు గంగ, కేసీ కెనాల్ ఆయకట్టు కింద 11,754, పురుష ఓటర్లు , 4620 మహిళా ఓటర్లు ఉన్నారన్నారు. మైనర్ ఇరిగేషన్ కింద 1120 ఓటర్లు, 459 మహిళా ఓటర్లు ఉన్నారన్నారు. కేసీ కెనాల్ సంబంధించి 5948 పురుషులు, 200452 మహిళా ఓటర్లు ఉన్నారని, అలాగే తెలుగు ఆయకట్టు కింద 4686 పురుష ఓటర్లు, 1709 మహిళా ఓటర్ల తో కూడిన జాబితాను విడుదల చేయడం జరిగిందని తహసిల్దార్ జ్యోతి రతకుమారి వివరించారు.

# ఫార్మసిస్ట్ పై క్రమశిక్షణా చర్యలకు ఆదేశాలు

**జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా**



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 13పాణ్యం మండలంలోని మద్దూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని ఓపి, ప్రసవాల వివరాలను మెడికల్ ఆఫీసర్ ను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది హాజరు పట్టికతో పాటు ప్రసవాల రిజిస్టరు, మందుల స్టాక్ వివరాలు, ఇతర వైద్య రికార్డులను పరిశీలించి ఆసుపత్రి పనితీరు సక్రమంగా లేదని పనితీరు మెరుగుపరచుకొని రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ మెడికల్ ఆఫీసర్ ను ఆదేశించారు. ఔషధ స్టాక్ రిజిస్టర్ ను పరిశీలిస్తూ కాలం చెల్లిన మందులు ఏమైనా ఉన్నాయా అని కలెక్టర్ ఆరా తీశారు. ఫార్మసిస్ట్ పనితీరు సక్రమంగా లేకపోవడంతో క్రమశిక్షణా చర్యలు గైకొనాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. ఆసుపత్రి పరిసర ప్రాంతాలలో ఉన్న చెత్తను తొలగించి పారిశుద్ధ చర్యలు చేపట్టి పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. బిపి, షుగర్ పరీక్షలు ఎలా నిర్వహిస్తున్నారని ప్రశ్నిస్తూ కలెక్టర్ స్వయంగా వైద్య సిబ్బందిచే పరీక్షలు చేయించుకున్నారు. ఈ ఔషధ , హెల్త్ కార్డుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైద్య ఆరోగ్య కేంద్రాధికారి డా. సునీత, ఇతర వైద్య సిబ్బంది ఆసుపత్రిలో ఉన్నారు.

# ప్రాథమిక ఉన్నత పాఠశాలల ఆకస్మిక తనిఖీ--



**జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా---**

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 13-పాణ్యం మండలం మద్దూరు గ్రామంలోని మండల పరషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల మరియు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసారు. ప్రాథమిక ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతం తక్కువగా ఉందని గ్రామంలో ఇంటింటికి తిరిగి బడిఈడు పిల్లలను గుర్తించి నమోదు చేయించాలని కలెక్టర్ ప్రధానోపాధ్యాయులు, టీచర్లను ఆదేశించారు. పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వ మెనూ ప్రకారం అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలిస్తూ కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల మైదానం, తరగతి గదులు, చుట్టుపక్కల పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. మనబడి మన భవిష్యత్తు కింద చేపట్టిన పాఠశాల భవన నిర్మాణాల పనులను కలెక్టర్ పరిశీలించారు. పాఠశాలలకు హాజరైన విద్యార్థుల సంఖ్య, పాఠ్య పుస్తకాలు, మరుగుదొడ్ల నిర్వహణ, త్రాగునీటి వసతి తదితర మౌలిక సదుపాయాలపై కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించాలని ఉపాధ్యాయులను కలెక్టర్ ఆదేశించారు.

# మాదిగల ఆత్మీయ సమ్మేళన సదస్సు కు మందకృష్ణ మాదిగ రాక..

.విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:-నవంబర్ 13 స్థానిక అంబేద్కర్ విగ్రహం దగ్గర కర్నూల్ లో జరుగు మాదిగల ఆత్మీయ సమ్మేళన సదస్సుకు ముఖ్యఅతిథిగా గౌరవ శ్రీ మందకృష్ణ మాదిగ హాజరవుతున్న కరపత్రాలను ఎంఎస్పి జాతీయ నాయకులు గుండాల ఈశ్వరయ్య మాదిగ విడుదల చేశారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌరవ శ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వం లో యస్సీ వర్గీకరణను సాధించుకోవడానికి 1994 నుండి 2024, వరకు అలుపెరుగని 30 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం చేయడం ద్వారా



2024, ఆగష్టు 1 తేదీన సుప్రీంకోర్టు యస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వెలువరించింది ఈ తీర్పును రాష్ట్రాలకు అధికారం ఇస్తూ తీర్పు ఇవ్వడం జరిగింది . రాష్ట్ర పర్యటన లో బాగంగా యస్సీ వర్గీకరణ విజయం సాధించి మొదటిసారిగా మహాజన నేత మందకృష్ణ మాదిగ ఈనెల 18వ తేదీ జరుగుతున్న ఉమ్మడి కర్నూలు జిల్లా ఆత్మీయ సమ్మేళన సదస్సు కు ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని అన్నారు . యస్సీ వర్గీకరణ తీర్పు సుప్రీంకోర్టులో వెలువడి 4 నెలల అవుతుంది కావున యస్సీ వర్గీకరణను ముఖ్యమంత్రి గౌరవ శ్రీ నారా చంద్రబాబు నాయుడు వెగవంతం చేయాలని కోరారు యస్సీ వర్గీకరణ పట్ల ముఖ్యమంత్రి గౌరవ శ్రీ నారా చంద్రబాబు నాయుడు తొందరగా నిర్ణయం తీసుకోవడం ద్వారా మాదిగ మరియు ఉప కులాలు ఉద్యోగ అవకాశాలు పొందుతారని ఎస్సీ వర్గీకరణ తర్వాతే ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్లు వదలాలని కోరారుగౌరవ శ్రీ మందకృష్ణ మాదిగ 18 తేదీన కర్నూలుకు వస్తున్నారు కావున మాదిగ మరియు ఉప కులాలు వికలాంగులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారుఈ కార్యక్రమంలో యమ్మస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి పులి కేశవయ్య మాదిగ ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు చినరాయుడు మాదిగ, యమ్మస్పీ డోన్ మండలం నాయకులు పులి పెద్దయ్య మాదిగ, డోన్ మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు సంజీవ మాదిగ,, కొత్తకోట శీను మాదిగ, కె. మురళి మాదిగ తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి జన్మదిన వేడుకలు



విభారె న్యూస్ నవంబర్ 13 ఆళ్ళగడ్డ ప్రతినిధి :- ఆళ్ళగడ్డ పట్టణంలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో వీరబ్రహ్మేంద్రస్వామి 416వ జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జన్మదిన వేడుకలు పురస్కరించుకుని స్వామివారి విగ్రహాలకు కాళికామాత ఆలయ కమిటీ అధ్యక్షులు ప్రముఖ శిల్పి దురుగడ్డ రవీంద్ర ఆచారి, మహిళా కమిటీ అధ్యక్షురాలు అనురాధ ఆధ్వర్యంలో అర్చకులు సత్యమయ్య ఉదయం అభిషేకం నిర్వహించి వివిధ రకాల పూలతో స్వామివారి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం దురుగడ్డ రవీంద్ర ఆచారి, సావిత్రమ్మ దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు అన్న సంతర్పణ నిర్వహించారు ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు రామాచారి, పుల్లయ్య ఆచారి, కృష్ణమాచారి, పెద్ద సుబ్బయ్య ఆచారి తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య సిబ్బంది సమయపాలన పాటించాలి

**జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకట రమణ**



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 13- ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది సమయపాలన పాటించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకట రమణ పేర్కొన్నారు. బుధవారం దీపకుంట్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆకస్మికముగా తనిఖీ చేశారు . ఈ ఆకస్మిక తనిఖీ లో భాగముగా ప్రాథమిక ఆరోగ్యకేంద్ర ఓపి విభాగాన్ని మరియు రోగులకు అందుచున్న సేవల గురించి ఆరా తీశారు . రికార్డులను మరియు రిపోర్టులను తనిఖీ చేశారు . మాతా శిశు సంరక్షణ వార్డును ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచవలేనని మరియు కాన్పు నకు వచ్చినటువంటి గర్భిణీ స్త్రీ ని సాధారణ కాన్పు అయ్యే విధముగా జాగ్రత్త తీసుకోవాలని మరియు ప్రమాదకర సంకేత లక్షణాలున్నటువంటి గర్భిణీ స్త్రీ ని వెనువెంటనే ఉన్నత రెఫరల్ ఆసుపత్రిని రెఫర్ చేయవలెనని లేనిచో కఠినమైన చర్యలు తెసుకోవడం జరుగుతుందని వైద్యాధికారికి మరియు స్టాఫ్ నర్స్ కు హెచ్చరించారు .

# బ్రహ్మంగారిమఠం కు మహానంది నుంచి పట్టు వస్త్రాలు

--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 13-. మహానంది ఆలయం తరపున బుధవారం పట్టు వస్త్రాలు సమర్పించారు. బ్రహ్మంగారి కళ్యాణోత్సవంలో భాగంగా పట్టు వస్త్రాలను సమర్పించినట్లు మహానంది దేవస్థానం ఆలయ ఈవో నల్లకాలువ శ్రీనివాసుల రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఏఈఓ మధు. ఆలయ వేద పండితులు శాతారం బట్ , కూరపాటి ఆంజనేయ అవధాని. ఆలయ ఉప ప్రధాన అర్చకులు కొమ్మొద్ది శంకరయ్య. తదితరులు పాల్గొన్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**